క్లుప్తంగా

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



రామగోపాలపురంలో సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామచంద్రయ్య

వెలిగండ్ల: ఓడీఎఫ్ ప్లస్ సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రామచంద్రయ్య, ఈఓపీఆర్డీ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని రామగోపాలపురం, మొగళ్లూరు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు విడివిడిగా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ సర్వేను సకాలంలో పూర్తి చేయని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడతామన్నారు. సచివాలయాల పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మొగళ్లూరు శానిటేషన్‌కు సంబంధించి ఈఓపీఆర్డీ టి.సుకుమార్ మెటీరియల్ పంపిణీ చేశారు.

పశుగ్రాసం విత్తనాలు పంపిణీ

హనుమంతునిపాడు: మండలంలోని గాయంవారిపల్లిలో రాయితీపై 400 కేజీల జొన్నలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యులు రాజశేఖర్ మాట్లాడుతూ అవసరమైన రైతులకు 50 శాతం రాయితీపై అందజేస్తామన్నారు. గాయం శ్రీనివాసులరెడ్డి ,గాయం రమణారెడ్డి, బి.నాగూర్‌వలి, మాజీ సర్పంచ్ పోలయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

వెలిగండ్ల: బదిలీపై వెళుతున్న తహసీల్దార్ ఎం డానియేల్‌ను కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. కార్యాలయ డీటీ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానించారు.

100 మందికి బీసీజీ వ్యాక్సిన్



పోర్టు సిబ్బందికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారులు

కందుకూరు: క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం 100 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి మారుతీరావు తెలిపారు. దీనిలో భాగంగా రామాయపట్నం పోర్టులో పనిచేస్తున్న సిబ్బందికి వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. పోర్టులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి బీసీజీ వ్యాక్సిన్ వేశామన్నారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిరోధించాలనే లక్ష్యంతో 18 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన వారికి వ్యాక్సిన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. పోర్టు జనరల్ మేనేజర్ శేషుకుమార్, పోర్టు సేఫ్టీ మేనేజర్ పోలారావు, వైద్యసిబ్బంది ప్రతాప్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



హనుమంతునిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూపర్‌వైజర్లు షేక్ గౌస్‌నీషాబేగం,కృపావరం అన్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్ నుంచి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ శక్తి శక్తి వాత్సల్య వంద రోజులు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలన్నారు. సెంటర్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

523 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం పండుగుల్ల, చూర, ముక్క బేళ్లు 523 కొనుగోలయ్యాయి. ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, జయవరం, కె.ఉప్పలపాడు, మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు పొగాకు బేళ్లను వేలానికి ఉంచారు. గరిష్ట ధర కేజీ రూ.185, కనిష్ట ధర రూ.149, సరాసరి ధర రూ.166.81 పలికింది. వేలంలో మొత్తం 20 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పోస్టులన్నీ ఖాళీ..పనులు ఎలా..?

- కనిగిరి మున్సిపాలిటీకి అధికారులు కావలెను..
- మున్సిపాలిటీల్లో కీలక పోస్టులన్నీ ఖాళీ
- 48 పోస్టులకు 17 మంది విధుల నిర్వహణ
- ఉన్న వారికి.. ఒక్కొక్కరికి రెండు, మూడు శాఖల ఇన్‌చార్జి బాధ్యతలు
- కమిషనర్ తీరుతో కుంటుపడిన పాలన



కనిగిరి మున్సిపల్ కార్యాలయం

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీ తీరు చూస్తుంటే .. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. 2011లో కనిగిరి పంచాయతీ నుంచి నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత 2022 జూలై 20న గ్రేడ్ మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. సుమారు 55 వేలకు పైగా జనాభా కలిగి 20 వార్డులున్నాయి. హోదా పెంచిన అధికారులు తగిన ఉద్యోగాల భర్తీ, మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర వైఫల్యం చెందారు. ఫలితంగా 2011లో కనిగిరి నగర పంచాయతీ కమిషనర్‌గా ఫల్గుణకుమార్ కందుకూరు నుంచి ఇన్‌చార్జి అధికారిగా (ఉన్నత స్థాయి అధికారి) తప్ప . మిగతా వారంతే ఇన్‌చార్జి కమిషనర్‌లే. గ్రేడ్ 2 మున్సిపాలిటీగా రూపాంతం చెందిన తర్వాత కూడా ఇన్‌చార్జిలుగా, గ్రేడ్ 3లో కమిషనర్‌గా పని చేసిన వారిని మాత్రమే నియమించారు.

రెండేళ్లు దాటినా భర్తీ కాని పోస్టులు

కనిగిరి గ్రేడ్ 2 మున్సిపాలిటీగా హోదా పొంది రెండేళ్లు దాటినా.. హోదాకనుగుణంగా పోస్టులు భర్తీ చేయలేదు. ఫలితంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవతం, ఇతర ప్రణాళికా బద్ధమైన చర్యలు తదితర అంశాల పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వాస్తవానికి గ్రేడ్-2 మున్సిపాలిటీలో కమిషనర్‌తో కలిపి 48 పోస్టులు ఉండాల్సి ఉండగా, 17 పోస్టుల్లో మాత్రమే అధికారులు ఉన్నారు. 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న వాళ్లలో కూడా కొందరు డిప్యూటేషన్‌పై బయట ఉన్నట్లు సమాచారం.

ఒక్కొక్కరికి మూడు..నాలుగు శాఖలు ..

మున్సిపాలిటీలో కీలక శాఖలన్నీ ఖాళీగా ఉండగా.. ఉన్న ఒకరిద్దరికి ఒక్కొక్కరికి మూడు, నాల్గు శాఖలు ఇన్‌చార్జిలుగా ఇవ్వడంతో ఒక ఫైల్ కదిలేందుకు, ఏదైనా ఒక పనిచేయాలంటే ఒకరిపై ఒకరు చెప్పుకొని కాలయాపనలు చేస్తున్నారు. కొందరైతే పని ఒత్తిడి తట్టుకోలేక సరైన సమాధానం చెప్పే పరిస్థితులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు.

కమిషనర్ తీరుతో కుంటుపడిన పాలన

మున్సిపాలిటీలో కీలక భూమిక పోషించి.. ఇటు ప్రజాప్రతినిధులకు, అటు మున్సిపల్ అధికార సిబ్బందిని సమన్వయం చేస్తూ.. ముందుకు నడవాల్సిన కమిషనర్ ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో సుమారు 12 లక్షల జనరల్ ఫండ్ మార్పుకు సంబంధించి, రూ. 4.60 కోట్ల ప్రత్యేక గ్రాంట్ నిధుల చెల్లింపు విషయంలో ఎంబుక్‌లు, చెక్‌బుక్‌లు తదితర అంశాల విషయంగా కమిషనర్‌కు, ఏఈకి మధ్య తీవ్ర వివాదం జరిగింది. తాను చూడని పనులకు బిల్లులపై సంతకాలు పెట్టననీ చెప్పడంతోనే ఈ వివాదం జరిగినట్లు ప్రచారం జరిగింది. దీంతో కమిషనర్ వత్తిడి తట్టుకోలే ఏఈ సెలవుపై వెళ్లి ఇటీవల తిరిగి వచ్చి జాయిన్ అయ్యారు. ఈ క్రమంలో సచివాయంలోని ఎమ్యునిటీ సెక్రటరీని పనిచేస్తున్న వారిని పరిపాలన సౌలభ్యం పేరుతో ఏఈ-2 బాధ్యతలు అప్పగించారు. దీంతో మున్సిపల్ ఆఫీసులోని రెగ్యులర్ అధికారులు, సిబ్బంది, సచివాలయ అధికారులు కమిషనర్‌పై తీవ్రంగా మండిపడుతున్నారు. నిబంధనల పేరితో మెప్మా సిబ్బందిని తీవ్రంగా ఇబ్బందులు పెడుతుండటంతో పలు మార్లు పంచాయతీలు జరిగాయి. ఈక్రమంలో కనిగిరి మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు ఆ శాఖ పీడీకి కూడా ఫిర్యాదు చేశారు. ఇటీవల ఓ సచివాలయం కు చెందిన ఏఎన్ఎంలను విధుల నిర్వహణ పేరుతో ఇబ్బందులు పెడుతుంటంతో కమిషనర్ తీరుపై వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

కీలక పోస్టులన్నీ ఖాళీ..

ప్రధానంగా పట్టణ ప్రజలను వేధించే సమస్య పారిశుధ్యం, నీటి సమస్య, ఆతర్వాతే మిగతా శాఖల పనితీరు ఉంటుంది. అయితే రెండేళ్ల నుంచి కనిగిరికి శానటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. హెల్త్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు ఇచ్చి పనులు చేయిస్తున్నారు. వాస్తవానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ మేస్త్రీలు ముగ్గురు ఉండాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి లేదు. ప్రధానంగా కీలకంగా ఉండాల్సిన అసిస్టెంట్ ఇంజినీర్, ఎన్వీరాల్‌మెంట్ ఇంజినీర్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు ఉండాల్సి ఉండగా... ఏఈ ఒక్కరే ఉన్నారు. దీంతో రోడ్లు, కాలువలు, నీటి సమస్య తదితర అంశాల పరిష్కారం నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో పట్టణంలో నీటి సమస్య చిక్కుముడిలా మారింది. అధికారుల మధ్య సమన్వయ లోపంలో పట్టణంలో నీటి సమస్యతో ప్రజలు అల్లాడే పరిస్థితి. బోర్లు లేని చోట నీటి ట్యాంకర్ వాటర్ కావాలంటే ప్రజాప్రతినిధులు సైతం కాంట్రాక్టర్లను బతిమిలాడుకోవాల్సిన దుస్థితి.

ఆర్థిక సేవలపై సెమినార్



సెమినార్‌లో ఆర్థిక నివేదిక చూపుతున్న ప్రొఫెసర్లు

కందుకూరు: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ఆధ్వర్యంలో గురువారం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భారతదేశంలో ఆర్థిక సేవలు, అవకాశాలు, సమస్యలు, సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. దీనిలో భాగంగా న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విద్యాలయం ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.కామయ్య మాట్లాడుతూ వివిధ రకాలైన ఆర్థిక సేవలు ప్రజలకు అందుబాటులోకి రావాలన్నారు. దేశంలో ఆర్థిక కార్యక్రమాల పురోగతి, వివిధ దశలను వారు వివరించారు. విద్యార్థి దశ నుంచే ఆర్థిక వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నూతన విధానాలకు అలవాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా అభివృద్ధి సాధిస్తుందో అర్థం చేసుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఎంతైనా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు ఏడుకొండల నరేంద్ర, డీఆర్‌డీఏ డీపీఎం కె.కళ్యాణ్, యూనియన్ బ్యాంకు ఏజీఎం హరిబాబు, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మధుసూదన్‌రావు, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శంకర్రావు, బెంగుళూరు క్రైస్ట్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.జగదీష్, అధ్యాపకులు రాజా నరేస్, పి.రాజగోపాల్, డాక్టర్ తిరుపతిస్వామి, డాక్టర్ కె.సుజాత, డాక్టర్ కేవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీసీపీఎన్ డీటీ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వైద్యులపై, ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సేవ్ గర్ల్ చైల్డ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. రిజిస్టర్ లేని, అనుమతి లేని స్కాన్ సెంటర్లను నిర్వహిస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు రోషితారెడ్డి, చంద్రేష్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి, పారాలీగల్ వలంటీర్లు, ఫౌండేషన్ డైరెక్టర్లు ఎం రమేష్ బాబు, పి.నవకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్ సంబరాలు



రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌వో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పామూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సంద్భంగా స్థానిక కేజీబీవీ విద్యాలయంలో గురువారం పాఠశాల ఎస్‌ఓ కె.సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు రాజ్యాంగ పీఠికపై వివరించారు. అదే విధంగా భిన్నత్వంలో ఏకత్వంభావాన్ని పెంపొందించడం తెలియజేసి, రాజ్యాంగపీఠికపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ముందుగా విద్యార్థులు ఆడిన కబడ్డీ, ఖోఖో పోటీలు ఉత్కంఠగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏఓ వాణి, జయలక్ష్మి, పీడీ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు

కనిగిరి రూరల్: విద్యుత్ ప్రమాదాల నివారణలో విద్యుత్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి, ప్రజలను చైతన్యవంతులు చేయాలని విద్యుత్ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు అవగాహన కార్యక్రమం గురువారం డీఈఈ హరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలపై క్షేత్ర స్థాయిలో ముందస్తు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడం, ఈదురుగాలులు వీస్తున్నందున కరెంట్ స్తంభాలు తాకకుండా ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్యవంతులు చేయాలని చెప్పారు. డీఈ ఉమాకాంత్, డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పెద్దగొల్లపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

హనుమంతునిపాడు: పంచాయతీలు పరిశుభ్రంగా ఉండేలా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి అన్నారు. డయేరియా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని ఉమ్మనపల్లి, పెదగొల్లపల్లి, హనుమంతునిపాడు, తిమ్మారెడ్డిపల్లి, నందనవనం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్ర చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాచీన కళల్లో ప్రావీణ్యం అభినందనీయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ ఏజీఎం విజయభాస్కర్

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతోపాటు సంప్రదాయ, ప్రాచీన నృత్య కళల్లో నైపుణ్యం సాధించడం మంచి పరిణామమని జాతీయ రహదారుల శాఖ ఏజీఎం ఈ.వి జయభాస్కర్ కొనియాడారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని శ్రీరాం నగర్ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు భరతనాట్యం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌హెచ్‌ఏఐ ఏజీఎం మాట్లాడుతూ.. విద్యార్థులు నృత్య కళలలో ప్రావీణ్యం సాధించడానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని ప్రకటించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు ఎం.ప్రభాకరరెడ్డి, టి.సుజాత శాలువాతో సత్కరించారు.

నరసింహంకు సీపీఎం నేతల పరామర్శ



నరసింహంను పరామర్శిస్తున్న సీపీఎం నేతలు

గుడ్లూరు(కందుకూరు): అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు చేవూరు మాజీ సర్పంచ్ నూతలపాటి నరశింహంను సీపీఎం నాయకులు గురువారం పరామర్శించారు. నరశింహం గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కమ్యునిస్టు సిద్ధాంతాలతో నరశింహం పేద ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారని, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పేదల పక్షాన నిలబడి పోరాటం చేశారని వివరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ ఏర్పాటులో తనవంతు పాత్ర పోషించారని చెప్పారు. చేవూరులో మద్యపాన నిషేధం కోసం పోరాటాలు చేశారని చెప్పారు. సీపీఎం గుడ్లూరు మండల కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు, మండల నాయకులు పాలకీర్తి నాగేశ్వరరావు, ఇరువూరు బ్రహ్మయ్య, బోయపాటి శ్రీనివాసులు, హరిబాబు, సుబ్రహ్మణ్యం, ఎన్ వెకంటేశ్వర్లు, కృషిమూర్తి ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కందుకూరు: వాసవీ ఇంటర్నేషనల్ జిల్లా 205ఏ రీజియన్ చైర్మన్ కోటా రాము పర్యటనను పురస్కరించుకుని వాసవీ క్లబ్ లెజెండ్స్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా పట్టణ శివారు ప్రాంతమైన సుందరయ్యనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నోట్స్, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే పేద ఆర్యవైశ్య మహిళకు నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. వాసవీ క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ రవ్వా శ్రీనివాసులు, కార్యదర్శి ఇన్నమూరి శ్రీనివాసులు, ట్రెజరర్ చీదెళ్ల క్రిష్ణ, వాసవీ వనిత క్లబ్ ప్రెసిడెంట్ కొత్తూరి నటరాజకుమారి, కార్యదర్శి నారాయణ సుకన్య, పేరూరి లలిత, గుర్రం మంజులకుమారి, కోట వెంకటేశ్వర్లు, మురళి పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలను వినియోగించుకోవాలి



ప్రచార పత్రాలు అందజేస్తున్న అధికారులు

పామూరు: తపాలాశాఖ అందిస్తున్న నూతన పొదుపు పథకాలపై ప్రజలు అవగాహన కలిగి వాటిని వినియోగించుకోవాలని కందుకూరు డివిజన్ పోస్టల్‌శాఖ ఏఎస్పీ మధురవాణి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు సబ్‌పోస్టాఫీస్ పరిధిలో 'జనం లోకి మనం'అనే కార్యక్రమం ద్వారా పోస్టాఫీసులద్వారా తపాలాశాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పథకాలతో కూడిన ప్రచార పత్రాలను, బుక్‌లెట్‌లను అందజేశారు. సబ్‌పోస్ట్‌మాస్టర్ వలి, సుబ్బారావు, సర్పంచ్ ఎర్రగుళ్ల బాల, గోళ్ల మాల్యాద్రి, ప్రజలు పాల్గొన్నారు.

తహసీల్దార్ సుందరమ్మకు ఘన సన్మానం

మర్రిపూడి: బదిలీపై నెల్లూరు జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్ కేవీబీటీ సుందరమ్మను రెవెన్యూ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూలో మారుతున్న చట్టాలపై అవగాహన కలిగి భూ సమస్యలను పరిష్కరించే దిశగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర భూపతి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం నుంచి మర్రిపూడికి బదిలీపై వచ్చిన సుందరమ్మ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సామ్యేలు, కృష్ణ, ఖాశిం, సందీప్, ఏబేలు, ఏడుకొండలు పాల్గొన్నారు.



సుందరమ్మను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పొలం దారి పరిష్కారం



పొలం స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ విద్యాధరి తదితరులు

వలేటివారిపాలెం: మండలంలోని వీరన్నపాలెం గ్రామానికి చెందిన బొమ్ము ఓబులురెడ్డి తన పొలానికి దారి లేకపోవడంతో గతంలో కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయంపై స్పందించిన కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి గురువారం వీరన్నపాలెం గ్రామానికి వెళ్లి పొలాన్ని పరిశీలించారు. పొలం దారి గ్రామానికి కంఠానికి సంబంధించిందని రెవెన్యూ అధికారులు తెలపగా వెంటనే పంచాయతీ కార్యదర్శి పంచాయితీ సమావేశం ఏర్పాటు చేసి గ్రామ కంఠంలోని కొంత స్థలాన్ని పొలం దారికి కేటాయించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట వలేటివారిపాలెం డిప్యూటీ తహశీల్దార్ విజయభాస్కర్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

7న మండల సమావేశం

పీసీపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఆగస్టు 7న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఎబేట్ పిచికారీ

ఉలవపాడు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది సైడు కాల్వల్లో ఎబేట్ మందును పిచికారీ చేశారు. అయితే ఈ కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో నిర్వహిస్తేనే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చంటున్నారు.

నర్సాపురం ఎంపీడీఓకు నివాళి

పీసీపల్లి: నర్సాపురం ఎంపీడీఓ మృతికి పీసీపల్లి ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్బారావు మాట్లాడుతూ ఎంపీడీఓ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ గ్రామీణ పంచాయతీ ఇంజినీర్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక దినోత్సవం

సీఎస్‌పురం(పామూరు): శిక్షా సప్తాహ్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సాంస్కృతిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎం షేక్.ఖాదరున్నీసాబేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు మ్యాట్ల పంపిణీ

పీసీపల్లి: స్థానిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని 80 మంది విద్యార్థులకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో చదువుతున్న కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన వీరపనేని నవీన్ ఆర్థికసాయంతో మ్యాట్‌లు అందజేశారు. హాస్టల్ సంక్షేమ అధికారి సురేంద్ర, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, సురేంద్ర, రామయ్య, గుంటగాని జోసెఫ్, బద్దిపూడి ఎబినేజర్ దేవండ్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి



ఉలవపాడులో జాషువాకు నివాళి

ఉలవపాడు: ప్రముఖ కవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక శ్రీసాయి హైస్కూల్‌లో జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ కేశవరపు వెంకటశేషమ్మ, ప్రిన్సిపల్ మౌనిక మాట్లాడుతూ గుర్రం జాషువా జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు.

నేటి నుంచి 8వ రౌండ్ పొగాకు వేలం

కొండపి(సింగరాయకొండ): కొండపి బోర్డ్ పరిధిలో శుక్రవారం నుంచి ఎనిమిదో రౌండ్ పొగాకు వేలం ప్రారంభం అవుతుందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. 2023-24లో అధిక పొగాకు ఉత్పత్తి అమ్మకానికి సంబంధించి అనుమతి లభించిందని పేర్కొన్నారు. బ్యారన్‌కు 5 బేళ్ల చొప్పున, సాఫ్ట్, హీటెడ్ బేళ్లు లేకుండా, ఒక్కో బేల్ 150 కేజీలకు మించకుండా వేలానికి తీసుకురావాలని సూచించారు. అధిక పొగాకు విక్రయానికి సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేస్తామని స్పష్టం చేశారు. అధిక పొగాకు విక్రయించే రైతులు తమ దగ్గర ఎంత నిల్వ ఉందో క్లస్టర్ ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియజేసి, దరఖాస్తు ఫారం పూర్తి చేసి బోర్డ్‌లో సమర్పించాలని సూచించారు. పొగాకును కేవలం బోర్డ్‌లోనే అమ్మాలని, అక్రమ అమ్మకాలకు ఎటువంటి ఆస్కారం లేదని, రైతులు ఆయా తేదీలను గమనించి వేలానికి బేళ్లు తీసుకురావాలని చెప్పారు.